సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



డీసీసీబీకి పునరుజ్జీవం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుస్తోంది. ▸ 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.61,330
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,508
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,673
నవర (8 గ్రా) - రూ.45,384

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.1 /28.4

సోమవారం గాలిలో తేమ 50 శాతం ఉంది. మంగళవారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

స్వర్ణ సంరంభం

రొట్టెల పండగకు మూడో రోజూ పోటెత్తిన భక్తులు

నెల్లూరులో వేడుకగా జరుగుతున్న రొట్టెల పండగకు లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం తెల్లవారుజామున జరిగిన గంధ మహోత్సవంలో భక్తులు లక్షలాదిగా పాల్గొని వహీద్‌ల సమాధులకు లేపనం చేసిన గంధాన్ని అందుకునేందుకు పోటీపడ్డారు. అనంతరం వరాల రొట్టెలు అందుకునేందుకు వచ్చిన భక్తులతో స్వర్ణాల ఘాట్ నిండిపోయింది.

- దర్శనానికి గంటల కొద్దీ నిరీక్షణ
- తెల్లవారుజాము నుంచి స్వర్ణాల ఘాట్ కిటకిట
- చెరువులో రొట్టెను పట్టుకున్న మంత్రి కాకాణి





విద్యుద్దీప కాంతుల్లో బారాషహీద్ దర్గా

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగ వేడుకగా జరుగుతోంది. మూడో రోజు సోమవారం కూడా భక్తులు పోటెత్తారు. దీంతో స్వర్ణాల తీరం భక్తజన సంద్రమైంది. తాము అనుకున్న కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. సోమవారం తెల్లవారుజామున దర్గాలో కీలకమైన గంధ మహోత్సవాన్ని సాంప్రదాయంగా నిర్వహించారు. ఈ గంధ మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ ఉత్సవ ఘట్టం తర్వాత వహీద్‌ల సమాధులకు పవిత్రమైన గంధాన్ని లేపనం చేయగా, ఆ సమాధులను దర్శించుకుంటే తప్పక కోర్కెలు ఫలిస్తాయన్న నమ్మకంతో భక్తులు రావడం విశేషం. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో నెల్లూరు నగరంలోని అన్ని రోడ్లు నిండిపోయాయి. కోర్కెలతో వచ్చిన భక్తులు వరాల రొట్టెలు పట్టుకునేందుకు రద్దీ కారణంగా నిరీక్షణ చేయాల్సి వచ్చింది.

స్వర్ణాల ఘాట్లు కిటకిట

రొట్టెల పండగలో ముఖ్యమైన గంధ మహోత్సవ ఘట్టం ముగియడంతో భక్తుల తాకిడి పెరిగింది. గంధ మహోత్సవం అనంతరం వరాల రొట్టెలను పట్టుకుంటే కోరికలు ఫలిస్తాయనే నమ్మకంతో ఆదివారం రాత్రి నుంచే భక్తుల రాక పెరిగింది. సోమవారం ఉదయం నుంచి స్వర్ణాల చెరువు జనసంద్రంగా మారి భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. బారాషహీద్ దర్గాలో వహీద్‌ల సమాధులను దర్శించుకునే భక్తుల క్యూ భారీగా పెరగడంతో దర్శనం కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చింది. గంటల కొద్దీ క్యూలైన్లలో భక్తులకు నిరీక్షణ తప్పలేదు. స్వర్ణాల ఘాట్ కూడా భక్తులతో కిక్కిరిసింది.

దర్గాను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

రొట్టెల పండగ మూడో రోజు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు బారాషహీద్ దర్గాను దర్శించుకున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు దర్శించుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలని ఆకాంక్షిస్తూ స్వర్ణాల చెరువులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రొట్టెను పట్టుకున్నారు.

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రొట్టెల పండగ సందర్భంగా సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ రొట్టెను అందజేశారు. భవిష్యత్‌లో రాజకీయంగా మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని రూప్‌కుమార్‌కు మంత్రి కాకాణి రొట్టెను తినిపించారు. కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వరాల రొట్టెలకు డిమాండ్



స్వర్ణాల తీరంలో పలు వరాల రొట్టెలకు డిమాండ్ పెరిగింది. ఇందులో ప్రధానంగా ఉద్యోగం, ధన, పదోన్నతి రొట్టెల కోసం గంటల కొద్దీ భక్తులు నిరీక్షించాల్సి వస్తోంది. అధిక మంది ఆయా రొట్టెలను పట్టుకునేందుకు స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద పోటీపడ్డారు. అలాగే ధన, ప్రమోషన్, పెళ్లి రొట్టెలకు కూడా డిమాండ్ ఉండడంతో భక్తులు ఘాట్ల వద్ద నిరీక్షణ చేయాల్సి వచ్చింది.

దర్గాను దర్శించుకున్న ఐజీ

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ సందర్భంగా గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం రాత్రి బారాషహీద్ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ఆవరణలో బందోబస్తు, గంధం ఊరేగింపు ప్రాంతం, స్వర్ణాల ఘాట్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా రొట్టెల పండగ ప్రారంభం నుంచి నేటి వరకు తప్పిపోయిన 80 మంది చిన్నారులను పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



బారాషహీద్ దర్గాకు గంధాన్ని తీసుకువస్తూ..



భక్తజనసంద్రమైన స్వర్ణాల చెరువు



డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌కు రొట్టె తినిపిస్తున్న మంత్రి కాకాణి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



బారాషహీద్ దర్గాకు చేరుకుంటూ..



స్వర్ణాల ఘాట్‌లో ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరిస్తున్న కమిషనర్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఐజీ, ఎస్పీ



భక్తులకు గంధం పంపిణీ చేస్తూ..



తప్పిపోయిన చిన్నారులను కుటుంబసభ్యులకు అప్పగిస్తూ..



దర్గాను దర్శించుకునేందుకు క్యూ లైన్‌లో ఉన్న మహిళలు



భక్తుల సేవలో..



దర్గా ప్రాంగణంలో సేద తీరుతున్న భక్తులు

న్యూస్‌రీల్

రోప్ స్కిప్పింగ్‌లో నాలుగు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

గుడ్లూరు: మండలంలోని చేవూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కర్నూలు జిల్లా కార్లేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సత్తా చాటి రెండు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అండర్-13 విభాగంలో 8వ తరగతికి చెందిన యశ్వంత్, 7వ తరగతికి చెందిన విష్ణుతేజ వెండి పతకాలు సాధించగా, అండర్-12 విభాగంలో జాస్మిన్, చంద్రశేఖర్ కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ శివరావమ్మలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

3.03 లక్షల మందికి వైఎస్సార్ పింఛన్ కానుక

- రూ.84.36 కోట్ల నగదు పంపిణీకి సిద్ధం



నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానక పంపిణీకి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 1వ తేదీ ఉదయం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుకను పంపిణీ చేయనున్నారు. 3,03,501 మంది లబ్ధిదారులకు రూ.84,36,71,000 నగదు అందించనున్నారు. వలంటీర్లు తెల్లవారుజాము నుంచి అవ్వాతాతల ఇంటి తలుపులు తట్టి పింఛన్ అందజేయనున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగనుంది.

సోమశిలలో 24.460 టీఎంసీలు



చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 24.460 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 819 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,150, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 100, కండలేరుకు 110 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 89.895 మీటర్ల నీటి మట్టం ఉంది.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రాయసం ఆదిశేషు విఠల్‌బాబును గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అద్దంకి కోర్టులో కేసును చూసుకుని బయటకు వచ్చిన విఠల్‌బాబును గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అతడిని చంపి పూడ్చిపెట్టడం దారుణమన్నారు. న్యాయవాదులకు పూర్తిగా రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు కారకులైన వారిని అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా, కోశాధికారి ధన్‌పాల్ రమేష్, సభ్యులు ప్రసాద్, రేఖారాణి, సీనియర్ న్యాయవాదులు కోటయ్య, కృష్ణుడు, రాజేంద్రప్రసాద్, నరసయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో

- లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్వో మాల్యాద్రి

ఆత్మకూరు: తన కుమారుడి జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని అడిగిన రైతు వద్ద రూ.16 వేలు లంచం డిమాండ్ చేసిన వీఆర్వోను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన ఆత్మకూరు పట్టణంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఏసీబీ డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం దేపూరు గ్రామానికి చెందిన రైతు రావిళ్ల వెంకటేశ్వర్లు తన కుమారుడి జనన ధ్రువీకరణ పత్రం కోసం నెల రోజుల క్రితం ఆ గ్రామ వీఆర్వో మాల్యాద్రిని సంప్రదించాడు. సర్టిఫికెట్ ఇచ్చేందుకు సాధారణ కాలపరిమితి దాటిపోవడంతో, తొలుత వీఆర్వో, తహసీల్దార్ల నివేదిక ప్రకారం ఆర్డీఓ కార్యాలయం జారీ చేయాల్సి ఉంది. దీంతో వీఆర్వో మాల్యాద్రి లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు వెంకటేశ్వర్లు 1440018169 నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలిపాడు. సోమవారం సాయంత్రం వీఆర్వో మాల్యాద్రికి రైతు ఎల్‌ఆర్‌పల్లి కెనరా బ్యాంకు మిద్దె కింద అతను డిమాండ్ చేసిన రూ.16 వేలలో తొలి విడతగా రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్వోను అదుపులోకి తీసుకొని స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. అతనిని రిమాండ్‌కు పంపనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు ఆంజనేయరెడ్డి, శ్రీనివాసులు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

3న ముగియనున్న
పొగాకు వేలం



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 2022-23 సంవత్సరానికి సంబంధించి పొగాకు వేలం ఈ నెల 3న ముగియనుందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఓపెన్ క్లస్టర్ ద్వారా రైతులు 728 బేళ్లు వేలం కేంద్రానికి తీసుకురాగా 6 బేళ్లను తిరస్కరించినట్లు తెలిపారు. 91 వేల కిలోల పొగాకును రైతుల వద్ద కొనుగోలు చేయగా, రూ.2.35 కోట్లకు పైగా ధర లభించినట్లు తెలిపారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.270, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.257.62 లభించిందని తెలిపారు. కాగా ఈ నెల 1వ తేదీన మర్రిపాడు, తిక్కవరం, పొంగూరు, దుత్తలూరు క్లస్టర్ల పరిధిలోని రైతుల వద్ద పొగాకు బేళ్లు కొనుగోలు చేస్తామని, 2, 3 తేదీల్లో ఓపెన్ క్లస్టర్ల ద్వారా వేలం కేంద్రం పరిధిలోని రైతులందరి వద్ద ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేసి ఈ సీజన్‌లో పొగాకు వేలం ముగించడానికి నిర్ణయించామని తెలిపారు.

క్లుప్తంగా

ఆగస్టు 12 నుంచి సీ ఫుడ్ ఫెస్టివల్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఆగస్టు 12 నుంచి మూడ్రోజుల పాటు సీ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ప్రజల్లో సముద్ర చేపలు, రొయ్యలు, వాటి ఉత్పత్తుల వినియోగంపై ఉన్న అపోహలను తొలగించి మత్స్యఉత్పత్తుల మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి మత్స్యశాఖ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సీ ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా నెల్లూరులో మూడ్రోజుల పాటు ఏర్పాటు చేస్తున్న సీ ఫుడ్ ఫెస్టివల్ పట్టణంలో 2కే రన్‌తో ప్రారంభమవుతుందని చెప్పారు. సీ ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలతో చేసిన వంటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎం నాగేశ్వరరావు, భూమి ఆర్గానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలుడు ఘటనలో నిందితుడి అరెస్ట్

చేజర్ల: మండలంలోని మాముడూరులో మేలో జరిగిన బాణసంచా పేలుడులో ఘటనలో ఇద్దరు మృత్యువాత పడగా, మరో ముగ్గురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన కేసులో నిందితుడైన జయంతుల్‌రెడ్డిని చేజర్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఉదయగిరి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

చేపల లోడు కంటైనర్ బోల్తా

• 8 మందికి గాయాలు



బోల్తా పడిన చేపల లోడు కంటైనర్

లింగసముద్రం: చేపల లోడుతో వెళుతున్న కంటైనర్ బోల్తా పడడంతో 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన లింగసముద్రం మండలంలోని చీమలపెంట–తూనుగుంట గ్రామాల మధ్య సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..చీమలపెంట చెరువులోని చేపల లోడుతో ఒంగోలు వైపు వెళుతున్న కంటైనర్ తూనుగుంట మధ్యలో ఉన్న టర్నింగ్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కంటైనర్‌లో ఉన్న 8 మంది గాయపడ్డారు. వలేటివారిపాళెం ఎస్సై మహేంద్రనాయక్, స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మల్లికార్జున ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను 108 వాహనంలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కంటైనర్‌లోని చేపలను మరో కంటైనర్ ద్వారా తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	133
లేయర్ (లైవ్)	88
బ్రాయిలర్ చికెన్	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	256
లేయర్ చికెన్	150



నిమ్మధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	రూ. 25
సన్నవి	రూ.15
పండ్లు	రూ. 5



డీసీసీబీకి పునరుజ్జీవం

జిల్లాలో రైతుల బ్యాంకుగా పేరొంది 105 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) గత నాలుగేళ్లుగా ఎంతో అభివృద్ధి సాధిస్తోంది. గతంలో ఈ బ్యాంకు నష్టాల ఊబిలో కూరుకుపోయి మనుగడ సాగించడమే కష్టంగా ఉండేది. ఈ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే డీసీసీబీ అభివృద్ధికి షేర్ క్యాపిటల్ కింద రూ.40 కోట్లు సాయం అందించారు. దీంతో బ్యాంకు పునర్జీవం పోసుకుంది. 20 శాఖల ద్వారా జిల్లా రైతాంగానికి తక్కువ వడ్డీకే విరివిగా రుణాలు అందిస్తూ మన్ననలు పొందుతోంది.

- జిల్లాలో రైతులకు అందుబాటులో 20 శాఖలు
- విరివిగా రుణాలు అందిస్తున్న బ్యాంకు
- ఇప్పటి వరకు రూ.1,336 కోట్ల రుణాలు
- దీర్ఘకాలిక రుణాలుగా అత్యధికంగా రూ.550 కోట్ల అందజేత



నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీ ప్రధాన పరిపాలనా కార్యాలయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) గత నాలుగేళ్లుగా ఎంతో అభివృద్ధి సాధిస్తూ రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం షేర్ క్యాపిటల్ కింద రూ.40 కోట్ల సాయం అందించడంతో బ్యాంకు అభివృద్ధికి దోహదపడింది. డీసీసీ బ్యాంకు అత్యధికంగా ఇప్పటి వరకు రూ.1,336 కోట్లను రుణాల రూపంలో అందజేసింది. ప్రధానంగా వ్యవసాయదారులకు గరిష్టంగా రూ.3 లక్షల వరకు పంట రుణాలను 7 శాతం వడ్డీకి అందిస్తోంది. దీర్ఘకాలిక రుణాల కింద డెయిరీ ఫాం, గొర్రెల పెంపకం, బోరుబావి, మోటార్ల ఏర్పాటు కోసం, భూమికి కంచె వేసేందుకు, భూమి అభివృద్ధి కోసం 11.25 శాతానికి రుణాలను అందిస్తోంది. అలాగే స్వల్పకాలిక రుణాల(ఎస్టీ అదర్స్) కింద గరిష్టంగా రూ.20 లక్షల వరకు 11.30 శాతం వడ్డీతో అందిస్తోంది. స్థిరాస్తి తాకట్టుపై ఓఎస్‌డీ రుణాలను రూ.25 లక్షల వరకు 12 శాతం వడ్డీతో, చిరువ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు(ఎస్ఎంఈ) రూ.5 లక్షల వరకు 11 శాతం వడ్డీకే అందజేస్తోంది. బంగారు ఆభరణాల హామీపై రూ.20 లక్షల వరకు, వ్యవసాయేతర రుణాలను(రూ.5 లక్షల వరకు రూ.0.66 పైసల వడ్డీ, రూ.5 లక్షల పైన రూ.0.75 పైసలకు) అతి తక్కువ వడ్డీతో అందిస్తోంది డీసీసీబీ గృహ తనఖాలపై మున్సిపాలిటీల్లో రూ.3 లక్షల వరకు 12 శాతం వడ్డీతో, గ్రామీణ ప్రాంతాల్లో రూ.5 లక్షల వరకు 11 శాతం వడ్డీతో అందజేస్తోంది. గృహ నిర్మాణాల కోసం జిల్లాలోని అన్ని బ్రాంచ్‌లలో రూ.75 లక్షల వరకు 9.50 శాతం వడ్డీతో, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 లక్షల వరకు 11 శాతం వడ్డీతో రుణాలు ఇస్తోంది. స్వయం సహాయక సంఘాలకు గరిష్టంగా రూ.20 లక్షల వరకు 7 శాతం వడ్డీతో, విద్యా రుణాలను రూ.20 లక్షల వరకు 11 శాతం వడ్డీతో, వ్యక్తిగత రుణాలు రూ.5 లక్షలు 13.75 వడ్డీతో, వాహన రుణాలను రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు 9 శాతం వడ్డీతో ఈ బ్యాంకు అందిస్తోంది. రైతులకు ఎరువుల వ్యాపారం, సీహెచ్‌సీలకు ట్రాక్టర్లు, హార్వెస్ట్ యంత్రాల కోసం రుణాలను కూడా అందిస్తోంది.

అత్యధికంగా దీర్ఘకాలిక రుణాలు

డీసీసీబీ ఇప్పటి వరకు అందజేసిన రూ.1,336 కోట్ల రుణాల్లో అత్యధికంగా రూ.550 కోట్లను ఎస్టీ అదర్స్‌కు ఇచ్చింది. రైతులకు క్రాప్‌లోన్ల రూపంలో రూ.330 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.207 కోట్లు, రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ.60 కోట్లు,స్వయంసహాయక సంఘాలకు రూ.50 కోట్లు అందజేసింది. సీహెచ్‌సీ ద్వారా రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాల కొనుగోలుకు రూ.37 కోట్లు, సొసైటీలకు బంగారు ఆభరణాల రుణాల రూపంలో రూ.22 కోట్లు, సొసైటీలకు ఎరువుల వ్యాపారానికి రూ.2 కోట్లు రుణాలుగా అందించింది. మిగిలిన రూ.78 కోట్లను విద్య, వ్యక్తిగత, వాహన రుణాలుగా అందించింది.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి



డీసీసీబీ ప్రస్తుతం రూ.16 కోట్ల ఆదాయంలో ఉంది. ఏ ఇతర బ్యాంకులు ఇవ్వని విధంగా రైతులకు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తున్నాం. జిల్లా రైతులు వారి అవసరాలకు అనుగుణంగా బ్యాంకు అందించే సేవలు, రుణాలను వినియోగించుకోవచ్చు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే బ్యాంకు ప్రధాన ఉద్దేశం.

– డాక్టర్ శంకర్‌బాబు, సీఈఓ, డీసీసీబీ

సీఎం చలువ వల్లే సాధ్యపడింది



నాలుగేళ్ల క్రితం డీసీసీబీ నష్టాల్లో కూరుకుపోయి మనుగడ సాధించడమే కష్టంగా ఉన్న సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి షేర్ క్యాపిటల్ కింద రూ.40 కోట్ల సాయం అందించారు. దీంతో ప్రస్తుతం బ్యాంకు ఆదాయంలో ఉంటూ సి–గ్రేడ్ నుంచి బి–గ్రేడ్ స్థాయికు చేరింది. సీఎం చలువ వల్లే బ్యాంకుకు పునరుజ్జీవం వచ్చింది. బ్యాంకు ఏ–గ్రేడ్ సాధించేలా అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

– కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చైర్మన్, డీసీసీబీ

జగనన్న కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలి

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



రొట్టెను ఇస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): నగరంలోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగలో నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ సోమవారం పాల్గొన్నారు. బారాషహీద్‌లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్వర్ణాల చెరువులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నగర ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని, జగనన్న కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ రొట్టెను వదలగా, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా నగర ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రొట్టెల పండగకు వచ్చే భక్తుల కోరికలు నెరవేరాలని, కోరికలు నెరవేరిన భక్తులు మళ్లీ వచ్చి రొట్టెలు వదలాలని ఆ భగవంతుడ్ని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. జగనన్న కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని, పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవచేస్తున్న ఆయనకు మంచి జరగాలని, జగనన్న, నగర ప్రజలు ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ రొట్టెను వదిలామని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్లు కరీముల్లా, అశ్విని, కామాక్షిదేవి, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవరావు, జయలక్ష్మి, సుజాత, జమీర్, ఆసిఫాబాబా, సుధీర్, ప్రసన్న, కే అనిల్‌బాబు, షేక్ మస్తాన్, షేక్ సిద్దిఖ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక భరోసా

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతికుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని, ఆ విషయాన్ని గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలే వివరిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం సోమశిల సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆత్మకూరు నియోజకవర్గంలో 93 సచివాలయాలు ఉండగా, 69 సచివాలయాల పరిధిలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప గడపకు చేరడంతో ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలను అమలు చేయడంతో గతంలో 50 శాతంగా ఉన్న డ్రాపౌట్స్ 9 శాతానికి పడిపోయిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో 99 శాతం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నమోదైందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న చుక్కల, సాదా బైనామా, అసైన్‌మెంట్ భూముల సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. పర్యాటక ప్రాంతం సోమశిల జలాశయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సోమశిల–ఆత్మకూరు రోడ్డును జాతీయ రహదారిగా మార్చి అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు పంపామని వివరించారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బీ ఓబులరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ అంకిరెడ్డి, ఎంపీటీసీ సునీత, సర్పంచ్ పెంచలయ్య, నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, జీ ఈశ్వరయ్య, వెంకటరమణ, పోలిరెడ్డి, ఎం మస్తానయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రొట్టెల పండగ

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): మత సామరస్యానికి ప్రతీకగా బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగను భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఘనంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బారాషహీద్ దర్గాను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, తదితరులతో కలిసి మంత్రి దర్శించుకున్నారు. అనంతరం స్వర్ణాలచెరువులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలని ఆకాంక్షిస్తూ రొట్టెను పట్టుకున్నారు. అనంతరం దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కాకాణి మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గతంలో కన్నా భిన్నంగా ఒకేరోజు లక్షలాది మంది భక్తులు విచ్చేసిన ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని వివరించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించిన కలెక్టర్ హరినారాయణన్, జాయింట్‌కలెక్టర్ కూర్మనాథ్, కార్పొరేషన్ కమిషనర్ హరినారాయణన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ పరమపవిత్రమైన రొట్టెల పండగను వైభవంగా నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయం సాధించి అధికారంలోకి రావాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన కొనసాగాలని, జిల్లాలో వైఎస్సార్‌సీపీ సంపూర్ణ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ రొట్టెను పట్టుకున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రొట్టెల పండగకు దేశ నలుమూలల నుంచి తరలివస్తున్న లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జేసీ రోణంకి కూర్మనాథ్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి నిర్మలా దేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగడి గోపురోత్సవం

నెల్లూరు(బృందావనం): ఆలవందార్ వర్ష తిరునక్షత్రం సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీవారు, ఆలవందార్లకు తిరుమంజనం, శాత్తుమొరై నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ శివకుమార్‌ఆచారి సోమవారం తెలిపారు. సంప్రదాయంగా సాయంత్రం 5.30గంటలకు గజేంద్రమోక్షాన్ని పురస్కరించుకుని గోపురోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి 7.30 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం


- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
- కొత్తూరులో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరులో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ భీమవరపు వెంకటకృష్ణారెడ్డి స్థానిక సర్పంచ్ ఈగ విజయమ్మ, వార్డు సభ్యులు భీమవరపు పుష్పలత, పేడూరు భవాని, ఇండ్ల రామలక్ష్మమ్మ, నెట్రంబాక వెంకటశేషయ్యతో పాటు మరో 300 మంది కార్యకర్తలతో కలిసి సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ప్రసన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొత్తూరులోని వెంకటకృష్ణారెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి నుంచి తమ కుటుంబ సభ్యుడిగా ఉన్న వెంకటకృష్ణారెడ్డి మధ్యలో కొద్దికాలం పాటు పార్టీకి దూరమయ్యారే తప్ప మరొకటి లేదన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే ఆయన గతంలో రెండు ఎన్నికల్లో తన కోసం కష్టపడి పనిచేశారని గుర్తుచేసుకున్నారు. ఆయనకు తన వైపు నుంచి తగిన మద్దతు ఉంటుందన్నారు. వెంకటకృష్ణారెడ్డి రాకతో కొత్తూరులో పార్టీకి మరింత బలం పెరిగిందన్నారు. సర్పంచ్ అడిగే నిధులను సైతం కొత్తూరుకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు తాను కష్టాల్లో ఉన్నప్పుడు, అధికారంలో ఉన్న సమయంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు తనతో నడిచారని, వారికి పార్టీలో తగిన గౌరవం ఎప్పటికీ ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మనందరి నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం కోసం అందరం సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునపాటి సురేష్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎం పరివాహన్‌లో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు



ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్

నెల్లూరు (టౌన్): రవాణాశాఖకు సంబంధించిన సేవలను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాదాపు 88కుపైగా సేవలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. వాహనదారుడు రవాణా కార్యాలయానికి వెళ్లకుండానే మొబైల్ లేదా నెట్ సెంటర్ నుంచే సేవలను పొందే అవకాశాన్ని కల్పించింది. తాజాగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల ఆర్సీలను కూడా డిజిటల్ విధానంలోకి తీసుకొచ్చింది. ఈ విధానాన్ని జూలై 29 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. లైసెన్సులు, ఆర్సీలకు సంబంధించి కార్డులు లేనందున ఇతర రాష్ట్రాలతో పాటు ఏపీలో పోలీసులు జరిమానా విధిస్తున్నారని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎం పరివాహన్ యాప్‌లో వాటిని అందుబాటులో ఉంచింది. ఎవరైనా లైసెన్స్‌లు, వాహన ఆర్సీలను ఈ యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెల్‌లో ఎం పరివాహన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే రవాణా, పోలీసు అధికారుల తనిఖీల సమయంలో అందులోనే లైసెన్సులు, ఆర్సీలను చూపించవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ ప్రగతి ద్వారా రవాణా సేవలను అందిస్తున్నారు. అయితే వీటిని ఎస్‌బీసీలోకి మార్పులు చేస్తుండడంలో గత ఏడాదిగా లైసెన్స్‌లు, ఆర్సీలు పొందినా కార్డులు ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పటి వరకు తీసుకున్న లైసెన్స్‌లు, ఆర్సీలకు సంబంధించి కార్డులను త్వరలో అందజేయనున్నట్లు రవాణా అధికారులు చెబుతున్నారు. గతంలో లైసెన్స్, ఆర్సీకి కార్డు, పోస్టల్ చార్జీలకు రూ.325కు పైగా ప్రభుత్వానికి చలానా చెల్లించాల్సి ఉండేది. అయితే వాహనాదారులపై ఈ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే సమయంలో కార్డు పేరుతో అదనంగా ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే కార్డులు ఇప్పిస్తామని చెప్పి కొంత మంది మధ్యవర్తులు వాహనదారుల నుంచి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఎం పరివాహన్ యాప్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఎవరూ కార్డు కోసమని డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటి నుంచి ఎం పరివాహన్ యాప్‌లో లైసెన్స్‌లు, ఆర్సీలు అందుబాటులో ఉంటాయి. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని రవాణా అధికారులు కోరుతున్నారు. అదే విధంగా ఇప్పటికే డీజీ లాకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ లాకర్‌లో వ్యక్తిగతమైన సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వమే అప్‌లోడ్ చేస్తోంది.